సాక్షి నంద్యాల

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



మంత్రాలయంలో లారెన్స్

మంత్రాలయం: సినీ నటుడు రాఘవ లారెన్స్ గురువారం రాత్రి మంత్రాలయం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి మంచాలమ్మకు హారతులు పట్టారు. రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళా వేదికపై రాజమండ్రి కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.88
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.304
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 24,776
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 24,237

న్యూస్‌రీల్

వినాయక లడ్డూ రూ.2.40 లక్షలు



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు

కోవెలకుంట్ల: వేలంలో వినాయక లడ్డూ రూ.2.40 లక్షలు పలికింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోవెలకుంట్ల గాంధీనగర్‌లో గణేశుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిమజ్జనాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి లడ్డూ వేలం వేయగా, కోవెలకుంట్లకు చెందిన టైలర్ షాపు యజమాని రాజు రూ.2.40 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే మరో లడ్డూకు నటవ చిన్న కాశన్న రూ.40 వేలకు వేలం పాట పాడారు. వీరికి వినాయక లడ్డూలను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లెవన్ ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

ఆఫ్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్



ఇసుకను బుకింగ్ కేంద్రం వద్ద గుమికూడిన వాహనదారులు

సి.బెళగల్: ఇసుక బుకింగ్ ప్రక్రియ గురువారం కూడా ఆఫ్‌లైన్‌లోనే కొనసాగింది. సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం– 2లో ఏర్పాటు చేసిన కేంద్రానికి జనాలు, వాహనదారులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అవస్థలు ఎదుర్కొన్నారు. గురువారం 55 టిప్పర్లు, 50 ట్రాక్టర్లకు 1,325 టన్నుల ఇసుకను బుక్ చేసినట్లు వీఆర్వో రఫీ తెలిపారు.

18న మెగా జాబ్ మేళా

బనగానపల్లె రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, దస్తగిరి గురువారం తెలిపారు.10వ తరగతి, ఐటీఐ ఇంటర్,డిప్లొమా,డిగ్రీ,పీజీ విద్యార్హతతో 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. తొమ్మిది ప్రముఖ కంపెనీలు 1,191 పోస్టులను భర్తీ కోసం నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావా లని చెప్పారు. వివరాలకు సెల్ 63032 44165, 97059 98056 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

చాగలమర్రి: చిన్న బోదనం గ్రామానికి చెందిన మొక్క జొన్న రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోయామని ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు యామా వెంకట్రామిరెడ్డి, కౌలు రైతులు శ్రీను, గురప్ప ఇంకా కొంత మంది సుమారు 30 ఎకరాల్లో కమర్షియల్ రకం మొక్క జొన్నను సాగు చేశారు. వీరంతా ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన విత్తనాలను ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ దుకాణంలో కొనుగోలు చేసినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. 90 రోజుల కాల పరిమితి పూర్తయినా కంకిలో పూర్తి స్థాయిలో గింజలు లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు పంటను పరిశీలించి, విత్తన కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

‘ప్రైవేట్’ జపం.. బాబు కుతంత్రం



పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఈ కోవలోనే వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెడుతోంది. అలాగే కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నుంచి అనుమతులు రాకుండా అడ్డుపడటం విమర్శలకు తావిస్తోంది.

- కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో కాలేజీలు నిర్మించడంతో కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం
- భారీగా తగ్గిపోనున్న మెడికల్ సీట్లు
- తీవ్రంగా నష్టపోనున్న విద్యార్థులు



నంద్యాలలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ

నంద్యాల(న్యూటౌన్): కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం కావడంతో స్థానికంగానే వైద్య విద్య చదివే అవకాశం లభిస్తుందని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఎన్‌ఎంసీ సీట్లు ఇస్తామన్నప్పటికీ తమకు వద్దని రాష్ట్ర ప్రభుత్వమే లేఖ రాసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో తలపెట్టిన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన ఐదు వైద్య కళాశాలలకు కుట్రపూరితంగా పొగ పెట్టింది. అలాగే వచ్చే ఏడాది ప్రారంభం కావాల్సిన ఏడు వైద్య కళాశాలల నిర్మాణ పనులను అటకెక్కించింది.

వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందనే..

ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటయితే విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు మెరుగు పడతాయి. అలాగే వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుంది. దీనిని తట్టుకోలేక కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. దీంతో డాక్టర్లు, వైద్య సిబ్బంది సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఇమేజ్ పెరుగుతందనే ఉద్దేశంతో ప్రైవేటు పరం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

చరిత్రలో నిలిచిపోయేలా..

నంద్యాల వాసుల కలలు నిజం చేస్తూ చరిత్రలో నిలిచిపోయేలా గత ఏడాది సెప్టెంబర్ 15వ తేదీన నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల మెడికల్ కళాశాల భవనం, బోధనాసుపత్రి భవనాలను 50.93 ఎకరాల్లో 11.84 లక్షల చదరపు అడుగులలో నిర్మించింది. ఇందు కోసం రూ.475 కోట్ల నిధులను వ్యయం చేసింది. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని అధునాత వసతులు కల్పించేలా జీ ప్లస్ మూడు ఫ్లోర్లతో భవనాన్ని నిర్మించారు. ఇందులో మూడు మ్యూజియమ్స్, ఎనిమిది టీచింగ్ గదులు, ఎనిమిది లేబోరేటరీలు, రెండు ఎగ్జామినేషన్ హాళ్లు, నాలుగు లెక్చరర్ హాళ్లు ఉన్నాయి. రెసిడెన్షియల్, యూజీ హాస్టళ్లు, స్టాఫ్ అకామిడేషన్, వర్కింగ్ స్టాఫ్, నర్సెస్ రూమ్స్, గెస్ట్ హౌస్, స్టూడెంట్ నర్సెస్ హాస్టళ్లు, నర్సింగ్ కాలేజీ భవనం ఉంటుంది. హాస్టల్లో డైనింగ్ హాల్, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, బయోమెడికల్ వేస్ట్ రూమ్ ఏర్పాటయ్యాయి.

పేదలకు వైద్య విద్య భారం

నంద్యాలలో వైద్య కళాశాల అందుబాటులోకి రావడంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు లభించడంతో పాటు పరోక్షంగా, ప్రత్యక్షంగా వందల మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. ఈ కళాశాలకు 150 సీట్లు మంజూరు అయ్యాయి. గతేడాది నంద్యాల జిల్లాకు చెందిన 17 మంది విద్యార్థులు కళాశాలలో సీటు సాధించి వైద్య విద్య అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం కొత్త వైద్యకాలేజీలను ప్రైవేట్‌కు ఇస్తుండటంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



ప్రైవేటు పరం చేయడం సరికాదు



నీట్ పరీక్ష రాశాను. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని ఎంతో ఆశతో ఉన్నా. అయితే ప్రభుత్వం మా ఆశలపై నీళ్లు చల్లింది. కాలేజీని ప్రైవేట్ పరం చేయాలని చూస్తోంది. గత ప్రభుత్వం కాలేజీలు నిర్మించడంతో కక్ష కట్టి ఈ ప్రయత్నం చేయడం తగదు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

–వైష్ణవి, ఆళ్లగడ్డ

పేద విద్యార్థులపై భారం



మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులపై భారం పడుతుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులపై ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. దీని వల్ల పేదవిద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుంది.

–మునిజాహ్నవి, చిన్నకొమ్మెర్ల

పునరాలోచించాలి



రైతు కుటుంబం నుంచి వచ్చాను. కష్టపడి చదివి నీట్‌లో 582 మార్కులు సాధించాను. గత ప్రభుత్వంలో వైద్య విద్యను పేద విద్యార్థులకు సైతం అందుబాటులోకి తెచ్చేలా కళాశాలలను నెలకొల్పింది. సీట్లను కూడా పెంచింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటు పరం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుని ఈ నిర్ణయంపై పునరాలోచించాలి. వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయొద్దు.

–మధులిక, నందికొట్కూరు

ఆళ్లగడ్డను వణికిస్తున్న అతిసారం

వాంతులు, విరేచనాలతో మరో ఇద్దరు మృతి

- మరో వంద మందికి అస్వస్థత
- 10 మంది పరిస్థితి విషమం





మృతులు చంద్రమోహన్, హుస్సేన్‌బాషా

ఆళ్లగడ్డ: పట్టణాన్ని అతిసార వ్యాధి వణికిస్తోంది. గత 9వ తేదీ ఒకరు మరణించగా.. తాజాగా మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో వంద మంది వరకు అస్వస్థతకు లోనుకాగా, వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గత వారం రోజులుగా ఏ వీధుల్లో పర్యటించినా నిశబ్ద వాతావరణ కనిపిస్తోంది. గురువారం పట్టణంలోని ఆదర్శ అభ్యుదయ కాలనీలో చంద్రమోహన్ (45), హుస్సేన్‌బాషా(55)లు అతిసారంతో మృతి చెందారు. వాంతులు, విరేచనాలు కావడంతో ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్న వీరు కాస్త బాగుందని ఇంటికి వచ్చారు. సాయంత్రం మరోసారి వాంతలు, విరేచనాలు అధికమవడంతో వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మరణించారు. కాగా ఇదే కాలనీ, సమీప కాలనీల్లో మరో 10 మంది పరిస్థితి విషమంగా ఉండగా వందల మంది అస్వస్థతకు లోనై ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్న ఇప్పటి వరకు జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణంలో పర్యటించకపోవడంగమనార్హం. ఇక్కడి మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది అనేకమంది విజయవాడలో ఉన్నారు. పట్టణంలో డయేరియా విజృంభిస్తూ వేలాది మంది ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



చికిత్స పొందుతున్న బాధితులు

పరిశుభ్రతతో అతిసారం నియంత్రణ

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో అతిసార వ్యాధిని అరికట్టవచ్చని జిల్లా వైద్యాధి కారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. పట్టణంలో అతిసారం ప్రబలడంతో గురువారం ఆయ న ఇంటింటికీ వెళ్లి బాధితులను విచారించారు. రెండుసార్ల కంటే ఎక్కువగా విరోచనాలు అయితే వెంటనే దగ్గరలోని ఆశావర్కర్‌ను, ఏఎన్‌ఎంను సంప్రదించాలన్నారు. కాచి చల్లార్చి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం చేరుకుని సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్ చంద్రారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ నరసింహ, డాక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ, డీఈలను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా గృహ నిర్మాణాల ప్రగతిపై గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజు కనీసం రెండు ఇళ్లు పూర్తిస్థాయికి, పది ఇళ్లు స్టేజ్ కన్వర్షన్ స్థాయికి తీసుకురావాలని ఆదేశించినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు శ్రద్ధ చూపకపోవడం బాధాకరం అన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద 2,600 గృహాల లక్ష్యానికి గాను 243 మాత్రమే పూర్తిచేశారన్నారు. నందికొట్కూరు, పాములపాడు, ఆత్మకూరు, ప్యాపిలి, బేతంచెర్ల, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాల్లో పురోగతి లేదన్నారు. వచ్చే వారానికి 500 గృహాలు పూర్తి కావాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హీ సేవ

నంద్యాల(న్యూటౌన్): అన్ని గ్రామాల్లో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేపట్టి, పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీపీఓ మంజులవాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసిరాని ఖరీఫ్!

- సీజన్ మొదట్లో వర్షాభావం. చివర్లో అధిక వర్షాలు
- ఈ పంట నమోదుకు మూడు రోజులే గడువు
- ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.36 లక్షల హెక్టార్లు
- ఇప్పటి వరకు 1.82 లక్షల హెక్టార్లలో సాగు
- పప్పుధాన్యాల పంటల సాగుకు దాటిన అదును
- గణనీయంగా తగ్గిన పత్తి, మిరప సాగు
- ఆందోళనలో అన్నదాత

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అన్నదాతలకు కలిసిరావడం లేదు. సీజన్ మొదట్లో వర్షం ముఖం చాటేయడం.. ఇప్పుడు పంటలు ఏపుగా పెరిగే సమయంలో ఎడతెరిపిని వ్వకుండా కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియ కూడా అధికారులు నత్తనడకన చేపడుతుండటంతో పరిహారం అందేది కూడా అనుమానమేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– కోవెలకుంట్ల

జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.36 లక్షల హెక్టార్లలో పత్తి, మినుము, వరి,కంది, పెసర, మొక్కజొన్న, ఆముదం, ఉల్లి, వేరుశనగ, తదితర పంటలు సాగు చేయాల్సి ఉండగా ఆయా మండలాల పరిధిలో ఇప్పటి వరకు 1.82 లక్షల హెక్టార్లలో పంటలను రైతులు సాగు చేశారు. సీజన్ ముగిసేందుకు మరో ఇరవై రోజుల గడువు ఉండగా ఈ పంట నమోదుకు కేవలం ఐదు రోజులు మాత్రమే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు వెంటాడుతుండటంతో మిగిలిన పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాల కారణంగా పొలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి బీళ్లను తలపిస్తున్నాయి. వర్షాలు వీ డకపోవడం, ఖరీఫ్ పంటల సాగుకు అతి తక్కువ వ్యవధి ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

పప్పుధాన్యాల సాగుకు దాటిన అదును



తక్కువ విస్తీర్ణంలో సాగైన మిరప



విత్తనం వేసేందుకు వీలు లేక బీడుగా మారిన పొలం

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 44,728 హెక్టార్లలో కంది, మినుము, పెసర, తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. సీజన్ మొదట్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తినా జులై నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో 42 వేల హెక్టార్లలో పప్పుధాన్యాల పంటలు సాగు చేశారు. సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని భావించినా జులై నెలాఖరు నుంచి అరకొర వర్షాల వల్ల పంటలసాగు సాధారణ విస్తీర్ణానికి కూడా చేరుకోలేకపోయింది. పప్పుధాన్యాల పంటల సాగుతోపాటు జిల్లాలో 13,148 హెక్టార్లలో వేరుశనగ సాగు చేయాల్సి ఉండగా 7,068 హెక్టార్లలో, 439 హెక్టార్లలో ప్రొద్దుతిరుగుడు పంట సాగు చేయాల్సి ఉండగా కేవలం 35 హెక్టార్లు, ఉల్లి 4,091 హెక్టార్లకు గానూ 2,766 హెక్టార్లు, పసుపు 814 హెక్టార్లకు 457 హెక్టార్లు, 2,394 హెక్టార్లలో జొన్న సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 86 హెక్టార్లలో సాగయ్యాయి. జొన్న మినహా మిగిలిన పంటల సాగుకు అదును దాటిపోవడంతో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే ఆస్కారం ఉంది.


పంట నమోదుకు మూడు రోజులే గడువు

జిల్లాలో 2,36,906 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,82,439 హెక్టార్లలో సాగయ్యాయి. ఈ పంట నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పొలాలు బీళ్లగా మారి పంటల సాగుకు అవకావం లేకుండా పోయింది. వర్షాలు వీడకపోవడం, ఈ పంట నమోదుకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అతివృష్టి, అనావృష్టి, తదితర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ఈ పంట నమోదు ఆధారంగానే నష్ట పరిహారం వర్తిస్తుంది. జిల్లాలో ఇంకా 50 వేల హెక్టార్లకు పైగా వివిధ పంటలు సాగు చేయాల్సి ఉంది. వర్షాల వల్ల పొలాల్లో తడి ఆరకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మరో ఇరవై రోజుల్లో సీజన్ ముగియనున్నా ఈ పంట నమోదుకు గడువు లేకపోవడంతో రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తుండగా ఖరీఫ్ సీజన్ అర్ధాంతరంగా ముగియనుంది.

గణనీయంగా తగ్గిన పత్తి, మిరప సాగు

జిల్లాలో పత్తి, మిరప సాగు ఈ ఖరీఫ్‌లో గణనీయంగా తగ్గింది. 12,262 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 6,491 హెక్టార్లలో మాత్రమే సాగైంది. 23,516 హెక్టార్లలో పత్తిసాగు చేయాల్సి ఉండగా కేవలం 5,359 హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. మిరప నాట్ల సమయంలో వర్షాభావం, సాగు నీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో సాగు విస్తీర్ణం సగానికి తగ్గింది. ప్రస్తుతం సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా అదును దాటిపోవడంతో మిరపసాగుకు రైతులు సాహసం చేయలేకపోతున్నారు.

ఖరీఫ్ అచ్చిరాలేదు



ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. ఈ ఏడాది ఖరీఫ్ అచ్చిరాదని భావించి వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్‌కు పొలాలను సిద్ధం చేసుకుంటున్నా. నాకున్న రెండు ఎకరాల పొలంతోపాటు ఎకరా రూ.10 వేల చొప్పున చెల్లించి మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. నాలుగు ఎకరాల్లో జొన్న, పప్పుశనగ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

బీమా వర్తింపజేయాలి



ప్రభుత్వం ఖరీఫ్ పంటలతోపాటు రబీ పంటలకు కూడా ఉచిత పంటల బీమా వర్తింపజేయాలి. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ కంటే రబీలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది నాకున్న సొంత పొలంతోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని 70 ఎకరాల్లో జొన్న, పప్పుశనగ పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నాను.

– గోవిందరెడ్డి, రైతు, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

వరసిద్ధి వినాయకుడికి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న శ్రీశైలం ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం తరఫున గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన కాణిపాక బ్రహ్మోత్సవాలు 27వ తేదీతో ముగియనున్నాయి. శ్రీశైలదేవస్థానం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు, పండితులు, పలువురు అధికారులు పట్టువస్త్రాలను తీసుకుని వెళ్లగా కాణిపాక దేవస్థాన కార్యనిర్వహణాధికారి పి. గురుప్రసాద్, అర్చకులు పండితులు ఆహ్వానించారు. ముందుగా స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారికి పూజాదికాలను జరిపించారు. అనంతరం శ్రీశైల దేవస్థానం అధికారులను, అర్చకులను కాణిపాక కార్యనిర్వహణాధికారి, అర్చకస్వాములు, వేదపండితులు వేదాశీర్వచనంతో సత్కరించారు. ఆలయ సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీశైల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను సమర్పిస్తున్నట్లు ఈఓ పెద్దిరాజు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లెలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన వల్లెపు ప్రసాద్ కుటుంబీకులు వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారంతా టీడీపీలో కొనసాగుతుండగా ప్రసాద్ కుటుంబీకులు మాత్రం వైఎస్సార్‌సీపీలో ఉంటున్నారు. పని నిమిత్తం బయటకు వచ్చిన ప్రసాద్ బస్టాండ్ పరిసరాల్లో ఉండగా టీడీపీకి చెందిన పది మందికి పైగా అక్కడికి చేరుకొని అతనిపై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు పెద్దిరాజు, ప్రకాష్, సావిత్రి సంఘటన స్థలానికి చేరుకోవడంతో వారిపై దాడికి దిగారు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

19 నుంచి హైదరాబాద్ - తిరుమల ప్యాకేజీ టూర్

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి కర్నూలు మీదుగా తిరుమల ప్యాకేజీ టూర్ ఈనెల 19న ప్రారంభమవుతుందని ఏపీటీడీసీ డివిజినల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలోని హరిత హోటల్‌లో పికప్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. ఓల్వో ఏసీ స్లీపర్ బస్ హైదరాబాద్ నుంచి కర్నూలు మీదుగా ప్రతి రోజూ నడుపుతామన్నారు. పర్యాటకులకు తిరుమల తిరుపతి దేవస్థాన దర్శనం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ దర్శనంతో పాటు భోజనం, ఫ్రెషప్ తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. కర్నూలు నుంచి ప్రతి రోజు రాత్రి 11 గంటలకు ప్యాకేజీ టూర్ బస్ బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.3,930, పిల్లలకు (4 నుంచి 10 సంవత్సరాలు) రూ.3,630 ఉంటుందన్నారు. వివరాలకు 90101 77055ను సంప్రదించాలన్నారు.

26న సాంస్కృతిక పోటీలు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన జిల్లా స్థాయి యువజనోత్సవం/సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సెట్కూరు సీఈఓ దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 - 29 సంవత్సరాలలోపు యువ కళాకారులు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో భాగంగా ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యాలు (గ్రూప్, సోలో), జానపద గీతం (గ్రూపు, సోలో), పద్యాలు, కథారచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర అంశాల్లో యువ కృతి కింద హ్యాండీక్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్, ఆగ్రో ప్రొడక్ట్స్ నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, అందజేస్తారన్నారు. కళాకారులు https://bit.ly/knldy24 వెబ్‌లింక్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. లేదా ఈ నెల 26న ఉదయం 9 గంటల్లోపు ప్రత్యక్షంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

వర్షం ముంచి.. ధర వెక్కిరించి!

ఉల్లి రైతును వరుస వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తే.. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌గా మారి నిండా ముంచేస్తున్నారు. ఇప్పటికే దిగుబడి సరిగా రాక, పండిన పంట వర్షంలో తడిసి పీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతులపై వ్యాపారులు కనీస కనికరం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దేశం మొత్తం ఉల్లికి డిమాండ్ ఉన్నా.. ఇక్కడ మాత్రం ధర నేలచూపు చూడటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. మార్కెట్‌కు దిగుబడులు పోటెత్తుతున్నా.. ధర విషయంలో చుక్కెదురవుతోంది. పంట పండించటం ఒక ఎత్తయితే, అమ్ముకోవడం మరో ఎత్తుగా మారింది. రైతులను కళ్లెదుటే దగా చేస్తున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



తడిచిన ఉల్లిగడ్డలను మార్కెట్‌లోనే ఆరబోసిన దృశ్యం



కుళ్లిపోయిన ఉల్లి దిగుబడులు



కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ఉల్లి దిగుబడులు



దిగుబడుల పైనే సేదతీరిన రైతు

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లి ధర ఇలా.. (రూ॥ల్లో)

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
3వ తేదీ	రూ. 1,621	రూ. 3,919
4వ తేదీ	రూ. 1,237	రూ. 3,919
5వ తేదీ	రూ. 1,067	రూ. 3,369
6వ తేదీ	రూ. 719	రూ. 3,819
9వ తేదీ	రూ. 512	రూ. 3,419
11వ తేదీ	రూ. 307	రూ. 3,613
12వ తేదీ	రూ. 309	రూ. 3,689
13వ తేదీ	రూ. 301	రూ. 3,669

కాటేసిన కరెంట్

● వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హాలహర్వి: ఉమ్మడి కర్నూలులో జిల్లాలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మిద్దెపై ఆడుకుంటూ ఓ బాలుడు, పాణ్యం మండలం తొగర్చేడు వద్ద పొలానికి నీళ్లు కట్టేందుకు వెళ్లి ఓ రైతు కరెంట్‌కు బలయ్యారు. హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన వెంకటేష్‌కు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దాసరి అర్జున్ (17) గురువారం ఇంటి మిద్దెపై గడ్డి వేసేందుకు వెళ్లాడు. కాగా పైన ఉన్న 11 కేవీ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే దాసరి అర్జున్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తండ్రి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్ర తెలిపారు.



మృతుడు దాసరి అర్జున్ (ఫైల్)

పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి..

బొమ్మలసత్రం/పాణ్యం: నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన బలరాముడు (61) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పాణ్యం మండలం పరిధిలోని తొగర్చేడు గ్రామ సమీపంలో వరిసాగు చేస్తున్నాడు. గురువారం పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి వ్యవసాయ మోటర్ స్టార్టర్‌ను ఆన్ చేయబోయాడు. అయితే అప్పటికే స్టార్టర్‌కు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలో పడిపోయాడు. అక్కడే ఉన్న కూలీలు 108లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బలరాముడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య తిరుపాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.



రైతు బలరాముడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

మంత్రాలయంలో జల ప్రసాదం కౌంటర్లు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో శుద్ధజల ప్రసాదం కౌంటర్లను గురువారం మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు ప్రారంభించారు. స్థానిక విజయేంద్ర వసతి గృహం, బృందావన గార్డెన్, అన్నపూర్ణ భోజనశాలతో మూడు కొత్త శుద్ధ జల ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. దివి ల్యాబోరేటరీస్ సంస్థ ప్రతినిధులు నాగేష్, శ్రీనివాస్ సహకారంతో కౌంటర్లు నెలకొల్పారు. స్వామిజీ చేతుల మీ దుగా వేద మంత్రోచ్ఛారణ మధ్య శాస్త్రోక్తంగా వీటి ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ శ్రీమఠానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఈ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దాతలను ఈ సందర్భంగా పీఠాధిపతి శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, పరిమళ ప్రసాదం, మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు



జల ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సుభుదేంద్రతీర్థులు

ధిక్కార సీఐపై బదిలీ వేటు!

కర్నూలు: గణేష్ నిమజ్జన వేడుకల్లో ఉన్నతాధికారుల సమాచారం లేకుండా సొంతంగా వ్యవహరించాడనే కారణంతో కర్నూలు సబ్ డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు పడింది. సర్కిల్ పరిధిలో మూడు రోజులకే నిమజ్జన వేడుకలు జరిపించాల్సి ఉండగా, ఉన్నతాధికారులకు తెలియకుండా ఐదు రోజులకు అనుమతి ఇవ్వడంతో ఎస్పీ బిందుమాధవ్‌కు సమాచారం చేరింది. తనకు సమాచారం ఇవ్వకుండా ఐదు రోజులు ఎలా అనుమతి ఇస్తావంటూ ఎస్పీ ప్రశ్నించడంతో.. సరైన సమాధానం చెప్పనట్లు తెలిసింది. ఇదే సమయంలో తాను సెలవుపై వెళ్తానని చెప్పగా.. అలా కుదరదని, నిమజ్జన వేడుకల వరకు విధుల్లో ఉండాల్సిందేనని ఎస్పీ ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే సర్కిల్ బాధ్యతలను తప్పించి ఆదోని సబ్ డివిజన్‌లోని లూప్‌లైన్ విభాగానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో చార్జ్‌మెమో జారీ చేసినట్లు తెలిసింది. అయితే ఇన్‌స్పెక్టర్‌కు ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు రాజకీయంగా కూడా పలుకుబడి ఉండడంతో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో ఉన్నతాధికారిపై ఒత్తిడి చేయించి అదే సర్కిల్‌లో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం జరిగిన బదిలీల్లో రాజకీయ అండదండలతో కోరుకున్న చోటు దక్కించుకున్న ఈ సీఐ, ఇంతలోనే ఉన్నతాధికారినే ధిక్కరించగా బదిలీ వేటు పడటం గమనార్హం. ఇదిలాఉంటే ఈ విషయం చినబాబు దృష్టికి కూడా వెళ్లినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆరోగ్యశ్రీకి నగదు వసూలు చేస్తే చర్యలు

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) పథకం కింద రోగుల నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్యశ్రీ చికిత్సల కోసం ఆసుపత్రి యాజమాన్యాలు నగదు తీసుకున్నారనే వివరాలను ఫిర్యాదు రూపంలో రోగుల నుంచి ఏ విధంగా తీసుకుంటారని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి డీఎంహెచ్‌వో, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ నెలలో ఒకసారి సబ్‌కమిటీ స్థాయి సమావేశం నిర్వహించి వివరణ తీసుకోవాలని, సంతృప్తి చెందకపోతే ప్రతి మూడు నెలలకోసారి జరిగే జిల్లా స్థాయి కమిటీలో ఫిర్యాదును పరిశీలించాలన్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులకు సంబంధించి ఇప్పటి వరకు 174 ఫిర్యాదులు రాగా అందులో 134 వరకు నగదును రోగులకు ఆసుపత్రి యాజమాన్యాలు తిరిగి చెల్లించారన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంబీఎస్‌వీ. భాస్కరరెడ్డి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కోట్ల బ్యారేజీకి నీటి ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి (సుంకేసుల) బ్యారేజీకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం కొంత తగ్గింది. 33,798 క్యుసెక్కుల నుంచి 22,641 క్యుసెక్కులకు తగ్గింది. బ్యారేజీ గేట్లు 5 పైకెత్తి 20,196 క్యుసెక్కుల నీరు, కేసీ కాలువకు 2,445 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కుందూనదిలో ఇద్దరు గల్లంతు

● అనారోగ్యంతో ఒకరు, మద్యం మత్తులో మరొకరు కుందూలో దూకిన వైనం
● గల్లంతైన వారి కోసం గాలింపు

కోవెలకుంట్ల: కలుగొట్ల గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కుందూనదిలో గురువారం ఇద్దరు వ్యక్తులు గల్లంతయారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి(64) అనే వృద్ధుడు కొంత కాలం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో ఎలాగు బతకనని భావించి జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారు జామున తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. గ్రామ శివారులో ప్రవహిస్తున్న కుందూనదిలో దూకినట్లు అటుగా వెళుతున్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన బాలగురప్ప(42) అనే వ్యక్తి గ్రామంలో జరిగే ఓ వర్ధంతి కార్యక్రమంలో అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో కుందూనది వద్దకు వెళ్లి వంతెన పైనుంచి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ భూపాలుడు తమ సిబ్బందితో గల్లంతైన వారి ఆచూకీ కోసం నది వెంట గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కుందూనదిలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఇద్దరు ఆకతాయిలకు గురువారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన పిచుక శివశంకర్, నందవరం శివశంకర్ వరప్రసాద్‌లు స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్ద మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వనటౌన్ పోలీసులను ఆకతాయిలపై కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులకు జడ్జి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి

బొమ్మలసత్రం: పోలీసు శాఖలో అంకితభావంతో పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా బదిలీ అయిన సంతోష్‌కు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంతోష్ రెండేళ్లపాటు నంద్యాల జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. భవిష్యత్‌లో ఆయన పోలీస్ శాఖలో అత్యున్నత పదవులు పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు యుగంధర్‌బాబు, రవికుమార్, రామాంజినాయక్, శ్రీనివాసులు సీఐలు సూర్యమౌళి, ఎరిషావలి, ఇస్మాయిల్, మోహన్‌రెడ్డి, మల్లికార్జునగుప్తా, వెంకటేశ్వరరావు, ప్రియతమ్‌రెడ్డి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ సంతోష్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: మదిరె గ్రామానికి చెందిన వైష్ణవ్ వెంకటేశ్ (25) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదోని-ఇస్వీ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహంపై చొక్కాకు ఉన్న టైలర్ లేబుల్ వివరాల మేరకు మృతుడు మదిరె గ్రామానికి చెందిన వైష్ణవ్ వెంకటేశ్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఇతను మెడికల్ ఏజెన్సీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ రెండు నెలలు క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో గురువారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.



మృతుడు వైష్ణవ్ వెంకటేశ్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): పొదుపు గ్రూపు మహిళలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని డీఆర్‌డీఏ సెర్ప్ సమావేశ భవనంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుస్థిరమైన జీవనోపాధిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి, లక్‌పత్ దీదీలను గుర్తించి ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డేగలయ్య, డీపీఎం దానం, ఏరియా కో ఆర్డినేటర్లు ఎల్లయ్య, శ్రీనివాసు లు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాధవరం చెక్ పోస్ట్ దగ్గర రాయచూర్ వైపు నుంచి వస్తున్న జైలో వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 2,880 మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న పెద్దకడుబూరు మండలం నాగలాపురానికి చెందిన చాకలి గంగాధర్, మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన సుగాలి రమేష్‌నాయక్‌ను అరెస్ట్ చేశారు. వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన మద్యం విలువ రూ. 4 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నా.. తరలిస్తున్నా.. తన సెల్ 9440902579కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలో చెక్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఈఎస్‌ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు లింగప్రసాద్, సెబ్ కానిస్టేబుళ్లు భరత్, నరసింహరెడ్డి, రాధమ్మ, చెక్‌పోస్ట్ పీసీలు గోపాల్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి